ఈ క్రాప్‌తో రైతన్నకు భరోసా

- అన్నదాతకు నష్టం వాటిల్లకుండా ఆదుకుంటున్న ప్రభుత్వం
- నంద్యాల జిల్లాలో రబీలో సాధారణ సాగు 4.23,799 ఎకరాలు
- పంటల సాగు 3,27,491 ఎకరాలు
- ఈ క్రాప్ నమోదు 2,23,849
- ఫిబ్రవరి 15తో ముగియనున్న గడువు


ఈ క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యనిస్తోంది. సాగు దండగ కాదు... పండగ అనేలా అన్నదాత ఏ విధంగా నష్టపోకుండా అండగా నిలుస్తోంది. జిల్లాలో 411 రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి రైతాంగానికి విశేష సేవలు అందజేస్తుంది. ఖరీఫ్, రబీ సాగు సకాలంలో చేసుకునేందుకు వీలుగా రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా రైతుల ఖాతాల్లో డైరెక్ట్‌గా నగదు జమ చేస్తున్న ప్రభుత్వం విత్తనం మొదలుకొని పంట దిగుబడి చేతికొచ్చే వరకు బాధ్యతగా అండగా నిలుస్తుంది. దిగుబడులకు మద్దతు ధరను కల్పించి రైతులకు ఆసరగా నిలుస్తున్న ప్రభుత్వం ఊహించని విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని చేపడుతుంది. ప్రస్తుతం రబీలో రైతులు ఏఏ పంటలు సాగు చేశారు... ఎంత విస్తీర్ణం... వివరాలను వ్యవసాయ, హార్టికల్చర్, సిరికల్చర్ అసిస్టెంట్స్ నేరుగా పొలాల వద్దకు వెళ్లి ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ క్రాప్ నమోదుతో విపత్తులు సంభవించి పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం లభిస్తుంది. పంట బీమా, సున్నా వడ్డీ, రాయితీ విత్తనాలు పొందాలన్న ఈ క్రాప్‌నమోదు తప్పనిసరి. పంటల దిగుబడలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్ చేసి ఉండాలి.

జిల్లాలో రబీలో సాగు వివరాలు

జిల్లాలో రబీలో సాధారణసాగు 4,23,799 ఎకరాలు ఉండగా 3,27,491 ఎకరాల్లో సాగు చేశా రు. ఈ నెల 25వ వరకు 2,23,849 ఎకరాల్లో వ్యవసాయ అధికారులు ఈ క్రాప్ నమోదు చేశారు. రైతులు ఎక్కువగా మొక్కజొన్న, వరి, మినుము తదితర ఆహార ధాన్యాలు సాగు చేశారు. సాగు వివరాల మేరకు విలేజ్ అసిస్టెంట్లు ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు, మండల వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. రై తులు ఆధార్, బ్యాంకు ఖాతా ఫోన్ నెంబర్లు భూమికి సంబంధించిన వివరాలు రైతులు ఇస్తే సంబంధిత అధికారులు ఈ క్రాప్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 15వ తేదీతో ముగియనుంది.

రైతులకు ఉపయోగం


పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గత సంవత్సరం నేను సాగు చేసిన వరి పంట విపత్తుల మూలంగా నష్టపోయా. ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ లభించింది. ప్రభుత్వ సాయం మరువలేనిది.
– వెంకటేశ్వర్లు రైతు, కాపులపల్లి, బనగానపల్లె మండలం

అండగా నిలుస్తున్న ప్రభుత్వం


వైస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. పెట్టుబడి సాయంతోపాటు విత్తనాలు గ్రామంలోనే అందజేస్తుండడంతో మండల కేంద్రాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పాయి. ఏ కారణంగా రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో చేపట్టిన ఈ క్రాప్ నమోదు రైతులకు ఎంతో ఉపయోగకరం.
– శ్రీనివాసరెడ్డి,రైతు వెంకటాపురం, బనగానపల్లె మండలం

అప్రమత్తం కావాలి


రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇందుకు గడువు ఫిబ్రవరి 15 వరకు ఉంది. ఇంత వరకు పంటల నమోదు చేసుకోని రైతులు ఇప్పటికైనా అప్రమత్తం కావాలి. వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి.
– సుబ్బారెడ్డి,వ్యవసాయాధికారి బనగానపల్లె మండలం

క్లుప్తంగా

శ్రీ చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు


అమ్మవారి గర్భగుడిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నంద్యాలకు చెందిన జమ్మలమడుగు నాగరాజు అనే భక్తుడు సుమారు రూ.40వేలు వెచ్చించి వివిధ రకాల పూలతో గర్భగుడిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీర సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ


రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకులు జాన్ ప్రభార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం సిబ్బంది ఎల్లయ్య, ఫక్రుద్దీన్, భారతి, లక్ష్మిలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డుపై మట్టి కుండలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న నరేంద్రకు ఆదివారం శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నరేంద్రకు సంబంధించిన మట్టికుండలు ధ్వంసమై నష్టం వాటిల్లిన నేథ్యంలో తమవంతుగా ఆర్థిక సాయం చేశామని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబాయ్య, సురేష్, శివరామమద్దిలేటి, నాగరాజు, రవి,సూరి తదితరులు పాల్గొన్నారు.

నాల్గులైన్ల రహదారి నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: అయ్యల చెర్వు నుంచి పట్టణం మీదుగా కస్తూర్బా విద్యాలయం వరకు చేపట్టిన నాలుగులైన్‌ల రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని ఈరోడ్డు నిర్మాణానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ.19 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం రోడ్డు పనులను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్: కర్నూలు పట్టణంలోని కమ్మ సంఘం ఫంక్షన్ హాల్‌ల్లో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో డోన్‌కు చెందిన రాయలసీమ కరాటే ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనభరచారు. దివ్యభారతి, గాయిత్రీ, జ్యోత్స్నా మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకం సాధించగా స్వాతి ద్వితీయ స్థానంలో నిలిచారు. కరాటే మాష్టర్లు అఫ్రోజ్‌బాషా,అఖిలాండేశ్వరిలు బెస్ట్ రెఫర్‌లుగా నిలిచారు. వీరికి నిర్వాహకులు ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్‌ను అందించారు.

సన్మానం


ఇందుమతిని సత్కరిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: డోన్ మార్కెట్ యార్డు డైరక్టర్‌గా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్వేటి చంద్రశేఖరయ్య భార్య ఇందుమతిని ఆదివారం వాసవీ, వనితా క్లబ్, ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారని ఈ సందర్భంగా వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త, గుండా ఉమాదేవి, వెంకట లావణ్య తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్


ఆధునిక వసతులతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఫ్లైఓవర్ కింద రూ.14లక్షలతో ఆధునిక వసతులతో నిర్మించిన మరుగుదొడ్లను ఆదివారం కషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతోపాటు చిరు వ్యాపారుల సౌకర్యార్థలం మరుగుదొడ్లను నిర్మించామన్నారు. అదేవిధంగా గుత్తిరోడ్డులోని శేగు థియేటర్ వద్ద రూ.14లక్షలతో మరో మరుగుదొడ్డిని కూడా నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కొట్రికె హరికిషన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వరమ్మ, మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, రైల్వే నాగేంద్ర, ధారా హరినాథ్‌రెడ్డి, సుంకన్న, వెంకట్రాముడు, కుళ్లాయి, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, మునిసిపల్ ఏఈ జనార్దన్‌లు పాల్గొన్నారు.

ఐకమత్యంగా మెలగాలి


మాట్లాడుతున్న నూర్ అహ్మద్

బేతంచెర్ల: హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తారతమ్యాలను వదిలి మనం భారతీయులం అనే ఐక్యతతో మెలగాలని మతసామరస్య చైతన్య వేదిక అధ్యక్షుడు నూర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, ముద్దవరం గ్రామంలో జై హో, మతసామరస్య చైతన్య వేదిక సంయుక్తంగా ఐక్యత సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా హిందూ, ముస్లింల ఐక్యతను, దేశ సమగ్రతను తూట్లు పొడిచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మనమందరం భారత మాత ముద్దు బిడ్డలుగా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు తగరం నాగరాజు, శేషు, పీర్ బాషా, మధు, జాకీర్, కరిముల్లా, మద్దిలేటి పాల్గొన్నారు.

అన్నదానం


వృద్ధుడికి అన్నదానం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని హోసన్నా వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ఓబులాపురం గ్రామ సమీపంలోని శ్రీకాశిరెడ్డినాయన వృద్ధాశ్రమంతో పాటు పట్టణ శివార్లలోని అభాగ్యులకు ఆదివారం స్ఫూర్తి సేవా సమితి సభ్యులు దాతల సహాయంతో అన్నదానం చేశారు. ధర్మారం గ్రామానికి చెందిన యువకుడు మహేంద్ర తన సోదరి వివాహంలో మిగిలి పోయిన విందు భోజనాన్ని స్ఫూర్తి సభ్యులకు అందజేయగా వారు అన్నార్థులకు పంపిణీ చేశారు. అలాగే పట్టణానికి చెందిన వ్యాపారవేత్త రోషిరెడ్డి జన్మదినం పురస్కరించుకుని వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు అన్నదానం చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్ బాషా

బేతంచెర్ల: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహబూబ్ బాషా సూచించారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని షాదీఖానాలో పట్టణ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం మండల ఖాజీ నూర్ అహ్మద్, ముస్లిం మైనార్టీ పెద్దలు మూర్తుజావలీ, ఖాజా, సుభాన్, సాయబ్ ఖాన్, గని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సంక్షేమ అధికారి మట్లాడుతూ మసీదులు, దర్గాలు అభివృద్ధితోపాటు శ్మశానాల అభివృద్ధికి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. మసీదుల ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం రాకపోతే తన దృష్టికి తీసుకరావాలన్నారు. అదేవిధంగా పట్టణ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మహబుబ్ వలీ, సద్దామ్ అలీబేగ్, ట్రెజరర్ దస్తగిరితోపాటు 24 మంది కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ముస్లిం మైనార్టీ తరపుర విరాళాల రూపంలో సేకరించిన రూ. 3లక్షలతో ఏర్పాటు చేసిన వైకుంట రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు హనీఫ్, ముఫ్తి అజ్మతుల్లా, సికిందర్ అలీ, షేక్ హుస్సేన్, షమీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న సొరతీగ అల్లిక!

మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో కానుగ చెట్టును సొరకాయ తీగ అల్లేసింది. కానుగ చెట్టు మొత్తాన్ని ఏమాత్రం కనిపించకుండా తీగ అల్లుకున్న తీరు ఆకట్టుకుంటోంది. హరిత ఏనుగులా కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. –ప్యాపిలి

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

డోన్ మేజర్ గ్రామ పంచాయతీ చివరి సర్పంచ్ మృతి


శేగు అరుణమ్మ (ఫైల్)

డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లా, డోన్ మేజర్ గ్రామ పంచాయతీ చివరి సర్పంచ్ శేగు అరుణ(55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. 2000 నుంచి 2005 వరకు మేజర్ పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసిన శేగు అరుణమ్మ సౌమ్యురాలుగా పేరొందారు. రాజకీయ నేపథ్యం గల ఆ కుటుంబానికి దివంగత ముఖ్యమంత్రులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్యలతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆమె మృతిపట్ల రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఫోన్‌లో సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ తదితరులు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని జగదుర్తితోపాటు రూరల్ ఫీడర్, అముకదాడు టౌన్ ఫీడర్‌లకు మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

వడ్డె ఓబన్న గుర్తింపు అభినందనీయం

బేతంచెర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి విప్లవ వీరుడు వడ్డె ఓబన్న ఫొటోను తపాల బిల్లపై కేంద్ర ప్రభుత్వం ముద్రించడం అభినందనీయమని వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలు అర్పించిన వడ్డెర ఓబన్న సేవల్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తపాల బిల్లపై ఆయన ఫొటో ముద్రించడంపై వడ్డెర సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు సుబ్బరాయుడు, లాలెప్ప, రాజు పాల్గొన్నారు.

సత్కారం

డోన్ రూరల్ : ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడి సాధిస్తున్న మండల పరిధిలోని తాటిమాన్ కొత్తూరు గ్రామానికి చెందిన రైతు ఆవుల సుమన్‌ను ఆదివారం గ్రామస్తులు, ఆవని సీడ్స్ కంపెనీ ప్రతనిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆముదం ఆవని సీడ్స్ లిమిటెడ్ సౌత్‌జోన్ ఇన్‌చార్జ్ వేణు నరహరి, బాలాజీ సీడ్స్ డిస్ట్రిబ్యూటర్ శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

బొమ్మలసత్రం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో పాల్గొనే వారు హెల్మెట్ ధరించి ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్దకు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హాజరవుతారని వివరించారు.

యూనియన్ క్లబ్‌కు మహర్దశ

- రూ.6కోట్లతో సింథటిక్ కోర్టులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, మినీ మీటింగ్ హాల్ నిర్మాణం
- మంత్రి బుగ్గన చొరవతో ఇండోర్ స్టేడియంగా కళకళలాడుతున్న తీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు, క్రీడాకారులు


ఆధునిక వసతులతో నిర్మించిన ప్రేక్షకుల గ్యాలరీ


ఆధునిక హంగులతో నిర్మించిన సింథటిక్ కోర్టులు


నేడు ఆధునిక వసతులతో నిర్మించిన ఇండోర్ స్టేడియం

డోన్ : ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పూర్వీకులు, డోన్ మాజీ ఎమ్మెల్యే రావ్ బహదూర్ బుగ్గన శేషారెడ్డి తన సొంత నిధులతో రైల్వేస్టేషన్ రోడ్డులో నిర్మించిన యూనియన్ క్లబ్ భవనానికి 121 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ క్లబ్‌ను 1912 జనవరి నెలలో అప్పటి బ్రిటీష్ గవర్నర్ వర్నన్ ప్రారంభించినట్లు సమాచారం. డోన్ రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గామార్చి అటు హైదరాబాదు, ఇటు గుంటూరు వైపుల నుంచి బెంగళూరు, హుబ్లీ వైపు కొత్త రైలు మార్గాన్ని బ్రిటిష్ పాలకులు నిర్మించడంతో విడిది కేంద్రంగా యూనియన్ క్లబ్‌ను నిర్మించారు అప్పట్లో. ఈ క్లబ్‌లో సేదతీరడంతోపాటు కాలక్షేపం చేసేవారు. స్వాతంత్ర్యం అనంతరం అర్ధఎకరా విస్తీర్ణంలో విశాలంగా నిర్మించిన ఈ క్లబ్ సముదాయంతో పాటు టెన్నిస్ ఆడేందుకు మైదాన్నా ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌కు సుదీర్ఘ కాలం పాటు డాక్టర్ పోచా ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షులుగా పనిచేయగా, దివంగత ఆర్‌ఈ రవికుమార్, ఐపీ రామయ్యలు కూడా అధ్యక్షులుగా పనిచేశారు. 1984లో అప్పటి ప్రభుత్వం క్లబ్ లైసెన్స్ రద్దు చేయడంతో డీఐజీ ఎంఈ భాస్కర్ రావు సూచనల మేరకు ఎస్పీ గోపీనాథ్‌రెడ్డి స్థానికుల అభ్యర్థనకు స్పందించి క్లబ్‌కు కొత్త రిజిస్ట్రేషన్ చేయించారు. కాలక్రమేనా క్లబ్ నిర్వాహకులు క్రీడలను ప్రోత్సహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా క్లబ్‌లో నిర్వహిస్తుండేవారు. అనేకమంది సినీ ప్రముఖులను ఇక్కడ సత్కరించారు కూడా. అయితే కనీస వసతులు కరువై నిరుపయోగంగా మారిన క్లబ్ మంత్రి బుగ్గన చొరువతో ప్రస్తుతం కళకళలాడుతుంది. క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దడంతో ప్రజలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాటి యూనియన్ క్లబ్... నేటి ఇండోర్ స్టేడియం

చాలా ఏళ్ల నుంచి క్లబ్ వ్యవహారాలు జరగకపోవడంతో కొందరు సభ్యులు స్థలం నిరుపయోగంగా ఉందని భవనం శిథిలమైందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.6కోట్లను మంజూరు చేయించారు. అర్ధఎకరా విస్తీర్ణంలో ఉన్న క్లబ్‌లో రెండు సింథటిక్ కోర్టులతో ఇండోర్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్, మినీ మీటింగ్ హాల్, ప్రేక్షకుల గ్యాలరీ, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులను నిర్మించారు. చూడముచ్చటగా తీర్చిదిద్దారు. క్లబ్‌లో ప్రస్తుతం 150 మంది క్రీడాకారులు సభ్యత్వాన్ని తీసుకున్నారు.

అభివృద్ధికి కేరాఫ్ బుగ్గన


1912లో దివంగత ఎమ్మెల్యే రావ్‌బహద్దూర్ బుగ్గన శేషారెడ్డి తన సొంత నిధులతో క్లబ్ భవనాన్ని నిర్మించారు. బేతంచెర్లలో అన్నీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను దానం చేసిన బుగ్గన శేషారెడ్డి సేవలు చిరస్మరణీయం. పెద్దల బాటలోనే మంత్రి బుగ్గన ముందుకు సాగుతున్నారు. అభివృద్ధికి కేరాఫ్ బుగ్గన అనేలా నియోజకర్గాన్ని తీర్చిదిద్దుతున్నారు. – నాగేంద్ర, టెన్నిస్ క్రీడాకారుడు, డోన్.

కళాకారులకు ప్రోత్సాహం


క్రీడలనే కాదు కళాకారులను ప్రోత్సహించిన చరిత్ర ఈ క్లబ్‌కు ఉంది. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ పోచా ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సినియాక్టర్ దివంగత పద్మనాభం, ప్రముఖ రంగస్థల కళాకారుడు వెంకటనర్సు లాంటి కళాకారులను ఈ క్లబ్‌లోనే ఘనంగా సత్కరించారు. అలాంటి క్లబ్‌ను మంత్రి బుగ్గన అభివృద్ధి చేయడం అభినందనీయం. – జహీర్, టెన్నిస్ క్రీడాకారుడు, డోన్.

ఆధునికీకరణకు రూ. 6కోట్లు


శతాబ్దాల చరిత్ర కలిగిన యూనియన్ క్లబ్ ఆధునికీకరణకు మంత్రి బుగ్గన రు.6కోట్లు మంజూరు చేయించారు. దీంతో అద్భుతమైన క్రీడా మైదానాలతోపాటు ఆధునిక భవనం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ మినీ మీటింగ్ హాల్‌ను నిర్మించాం. వీటితో పాటు పట్టణంలో రెండు క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.
– సప్తశైల రాజేష్ మున్సిపల్ చైర్మన్, డోన్.